# అభివృద్ధే మా లక్ష్యం




విలేకర్లతో మాట్లాడుతున్న జూలకంటి

## ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

- ఎన్‌కౌంటర్లపై సుప్రీం జడ్జితో విచారించాలి : జూలకంటి

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను ప్రభుత్వం వెంటనే ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం సాగిస్తున్న నరమేధంలో ఎంతోమంది మావోయిస్టులు చనిపోయారని, దీన్ని తమ పార్టీ ఖండిస్తున్నట్టు తెలిపారు. కగార్ ఆపరేషన్‌ను వెంటనే ఆపి అక్కడున్న మిలిటరీ, పోలీసు బలగాలను వెనక్కి పిలిపించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చర్చలకు వస్తామని మావోయిస్టులు సానుకూలంగా స్పందించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అదేమీ పట్టించుకోకుండా కక్షపూరితంగా ఎన్‌కౌంటర్ చేయడం సరికాదన్నారు. అడవిలో ఉన్నవారు ప్రజల కోసం పోరాడుతున్నారే తప్ప వ్యక్తిగత హింస చేయడం లేదన్నారు. వారిని దేశద్రోహులుగా, ఉగ్రవాదులుగా కాల్చి చంపడం దారుణమన్నారు. అడవిలో ఉన్న సహజ వనరులు, ఖనిజ సంపద నిక్షేపాలు కాజేసి బడా కంపెనీలకు అప్పజెప్పడం కోసం ప్రభుత్వం ఈ చర్యలకు దిగిందని విమర్శించారు. కాశ్మీర్ పర్యటనలో ఉన్న 27 మందిని ఉగ్రవాదులు హత్య చేస్తే వారిని ఇప్పటివరకు కేంద్రం పట్టుకోలేదని, ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనపరచుకోలేదని, ఏం సాధించారని యుద్ధం ఆపేశారని ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందన్నారు. ఆపరేషన్ కగార్‌పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ విషయాలను ప్రజలకు, అఖిలపక్షానికి వివరించాలని, పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, పార్టీ పట్టణ-1,2 కార్యదర్శులు డా.మల్లు గౌతమ్ రెడ్డి, బావాండ్ల పాండు, జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, వినోద్ నాయక్, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తిరుపతి రామ్మూర్తి, నాయకులు కష్ణయ్య పాల్గొన్నారు.



పాలేరు సాగర్ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

## యుద్ధప్రాతిపదికన పాలేరు సాగర్ యూటీ పనులు

- జులై 10లోగా నీటిని విడుదల చేయాల్సిందే
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో**

ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే పాలేరులోని నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ అండర్ టన్నెల్ (యుటి) నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వచ్చే జూలై 10వ తేదీనాటికి పూర్తిచేసి వానాకాలం సీజన్‌కు రైతాంగానికి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. శుక్రవారం ఆయన కూసుమంచి మండలం జుజ్జులరావుపేటలో జరుగుతున్న పాలేరు సాగర్ కాలువ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గతేడాది కురిసిన భారీ వర్షాలకు సెప్టెంబర్‌లో పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం జుజ్జులరావు పేట సమీపంలో పాలేరు రిజర్వాయర్ దగ్గర ప్రధాన కాలువపై అండర్ టన్నెల్ (యుటి) కొట్టుకపోయిందన్నారు. రైతులకు ఇబ్బంది కలగకూడదన్న ఆలోచనతో అప్పట్లో తాత్కాలిక ఏర్పాట్లు చేసి సాగునీటిని అందించడం జరిగింది. శాశ్వత ప్రాతిపదికన రూ 14.20 కోట్లతో ఈ యుటి కాలువ మరమ్మతులను ప్రారంభించడం జరిగిందని ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగానికి జీవనాధారమైన ఈ కాలువ మరమ్మతులను పూర్తిచేసి సాగునీరు అందిస్తాం. దీని వల్ల ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా ఒక్క పాలేరు నియోజకవర్గంలో 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అత్యంత ప్రాధాన్యతా క్రమంలో అవసరమైతే రోజుకు రెండు షిఫ్ట్‌ల క్రమంలో పనిచేసి గడువులోగా నిర్మాణపనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్

- నేడు నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొననున్న సిఎం

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. శనివారం అక్కడ జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు వీలుగా ఆయన శుక్రవారం సాయంత్రం హస్తినకు చేరుకున్నారు. 2018 తర్వాత తొలిసారిగా నీతి ఆయోగ్ సమావేశానికి హాజరవుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంతే కావటం గమనార్హం. శనివారం ఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో శనివారం జరిగే నీతి అయోగ్ సమావేశానికి సీఎం హాజరవుతారు. ఆ సందర్భంగా ప్రధాని మోడీ, ఇతర ముఖ్యమంత్రులతో కలిసి ఆయన అల్పాహారం స్వీకరిస్తారు. వారందరితో కలిసి గ్రూప్ ఫొటో దిగుతారు.

**సమావేశంలో...**

1. వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్ ఎజెండాగా ఏర్పాటు చేసిన నీతి అయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్‌లో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను సీఎం ఆవిష్కరిస్తారు.
2. 2047 నాటికి తెలంగాణ సాధించదలుచుకున్న లక్ష్యాలు, పాలసీలు, సుపరిపాలన విధానాలు, రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం అందించాల్సిన సహాయ సహకారాలపై రాష్ట్రం తరపున ముఖ్యమంత్రి ప్రత్యేక నివేదికను సమర్పిస్తారు.
3. ఐటీ, ఫార్మా, పట్టణీకరణలో ముందున్న తెలంగాణ...ఆయా రంగాల్లో మరింత ముందుకు పోయేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సీఎం వివరిస్తారు.
4. ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, డ్రైపోర్ట్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐటీఐలను ఏటీఆర్‌లుగా మారుస్తూ మౌలిక వసతులు కల్పించటం, యువతకు నైపుణ్య శిక్షణతోపాటు వాటిని ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దటంపై రేవంత్ ప్రసంగిస్తారు.
5. వ్యవసాయం, సాగునీటి అభివృద్ధిలో భాగంగా రైతులకు రుణమాఫీ, వరికి బోనస్, సంక్షేమంలో భాగంగా అందిస్తున్న సన్న బియ్యం, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా తదితరాంశాలను సీఎం వివరిస్తారు.
6. సామాజిక సాధికారితలో భాగంగా ఎస్సీ ఉప కులాల వర్గీకరణ, కుల గణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభలో తీర్మానం తదితరాంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావిస్తారు.

## నేడు పాలిసెట్ ఫలితాలు

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2025 రాతపరీక్ష ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. పాలిసెట్ రాతపరీక్ష ఈనెల 13న జరిగిన విషయం తెలిసిందే. 1,06,716 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో 98,858 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న సాంకేతిక విద్యాభవన్‌లో పాలిసెట్ ఫలితాలను విడుదల చేస్తామని రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బిటిఇటి) ఇన్‌చార్జ్ కార్యదర్శి బి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

---

- అందుకోసం కేంద్రంతో కలిసి పని చేస్తాం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అవసరం
- మెదక్ పేరు తలచుకుంటే ఇందిరాగాంధీ గుర్తుకొస్తరు
- నిమ్జ్ బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

"ఎన్నికలప్పుడే రాజకీయాలు ఉంటాయి. మిగతా సమయంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పని చేస్తాం. అందుకోసం ప్రధాని మోడీని ఒక్కసారి కాదు 50 సార్లు అయినా కలుస్తాం. దీనిపై ఎవరేం అనుకున్నా మాకు ఇబ్బంది లేదు. అభివృద్ధి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అవసరం. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధికి కేంద్ర సాయాన్ని కోరతాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్ పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రూ.100 కోట్లతో నిర్మించిన తొమ్మిది కిలో మీటర్ల గ్రీన్ కారిడార్ నిమ్జ్ రోడ్డు, రూ.100 కోట్లతో జహీరాబాద్ పట్టణంలో నిర్మించిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. చిరాగ్‌పల్లి-ఇప్పపల్లి గ్రామాల మధ్య రూ.20 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మెప్మా పథకం కింద రూ.18 కోట్ల విలువ చేసే చెక్కులను ఆయా సంఘాలకు అందజేశారు. 126 కోట్ల బ్యాంక్ లింకేజీలను కూడా వివిధ మహిళా సంఘాలకు అందించారు. అనంతరం పస్తాపూర్ వద్ద జరిగిన బహిరంగసభలో సీఎం మాట్లాడుతూ.. 1984లో ఇక్కడి నుంచి ఎంపీగా ఎన్నికైన ఇందిరాగాంధీ ప్రధానమంత్రి పదవి చేపట్టినట్టు గుర్తు చేశారు. మెదక్ జిల్లా అంటే ఇందిరమ్మ.. ఇందిరమ్మ అంటే మెదక్ జిల్లా.. గుర్తుకు వస్తుందని అన్నారు. ఈ ప్రాంతంలో ఇందిరగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందన్నారు. 2014లో నిమ్జ్‌ను తమ ప్రభుత్వమే ఏర్పాటు చేసిందని, రాష్ట్ర విభజన అనంతరం వచ్చిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేటి వరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. నిమ్జ్ భూ నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నిమ్జ్‌లో మొత్తం 5612 కుటుంబాలు భూములు కోల్పోయాయని, వారందరికీ వారు కోరుకున్న చోట ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆ కుటుంబాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించి, అందరికీ ఇండ్ల పట్టాలు అందించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అందుకోసం తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి జిల్లాలో నాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఇక్రిసాట్ లాంటి పరిశ్రమలు వచ్చాయని, నేడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే నిమ్జ్ వచ్చినట్టు చెప్పారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీలు తీసుకువచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని తెలిపారు. నిమ్జ్‌లో హ్యుందాయ్ సంస్థకు 450 ఎకరాలు కేటాయించామని, త్వరలోనే కార్ల ఉత్పత్తిని ప్రారంభిస్తారని అన్నారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీగా జహీరాబాద్ ఉంటుందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తామన్నారు. నారాయణఖేడ్ అభివృద్ధికి ప్రత్యేక సమావేశం నిర్వహించి అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. సింగూరును ఎకో టూరిజంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

**అన్నివర్గాలకు న్యాయం.. నిండు మనసుతో దీవించండి**

రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడానికి కృషి చేస్తోందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వాన్ని నిండు మనసుతో దీవించాలన్నారు. యువత, నిరుద్యోగులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రయివేటు సంస్థల్లో లక్ష ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. మూడు లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులను తీసుకువచ్చి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెంచి, ఆ ఆదాయాన్ని పేదలకు పంచాలన్నదే తమ లక్ష్యమన్నారు. లక్ష మిలియన్ ఎకనామీ సాధించడమే తమ లక్ష్యమన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాబోయే రోజుల్లో నిత్యావసర సరుకుల పంపిణీ కూడా మహిళలకే అప్పగించనున్నట్టు తెలిపారు. కుటుంబంలో ఒక మహిళ చదువుకుంటే.. ఆ కుటుంబం మొత్తం విద్యావంతులుగా మారే ఆస్కారం ఉందన్నారు.. హైదరాబాద్‌ను న్యూయార్క్‌లా తీర్చిదిద్దుతామన్నారు.

**అధికారంలో లేకపోయినా ప్రజల్లోనే..**

అధికారంలో ఉన్నప్పుడే కాదు.. అధికారంలో లేకపోయినా ప్రజల్లో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తాను జడ్‌పిటిసి నుంచి అనేక పదవుల్లో పనిచేశానని, అధికారంలో లేకపోయినా తాను ప్రజల్లోనే ఉన్నానని అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ అధికారం పోగానే ఫామ్‌హౌస్‌కు పరిమితం అయ్యారని అన్నారు. కేసీఆర్ తన 40 ఏండ్ల రాజకీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇస్తే వారి అనుభవాలను పరిగణలోకి తీసుకొని మెరుగైన అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపి సురేశ్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, మదన్‌మోహన్, లక్ష్మీకాంత్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర సలహాదారు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, టిఎస్ ఐడిసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ సహిం, మాజీ టిఎస్‌ఐడిసి చైర్మన్ మహమ్మద్ తస్వీర్, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించిన సిఎం

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం మచ్నూర్ గ్రామ సమీపంలో రూ.26 కోట్లతో నిర్మించిన నూతన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కరచాలనం చేశారు. విద్యాలయ ఎన్‌సిసి విద్యార్థులతో గౌరవ వందనం స్వీకరించారు.

## బాలికపై పెంపుడు తండ్రి లైంగిక దాడి

- నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచిన మేడ్చల్ పోలీసులు

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

13 ఏండ్ల బాలికపై పెంపుడు తండ్రి లైంగికదాడికి పాల్పడిన దారుణ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ మున్సిపాలిటీ గిర్మాపూర్‌కు చెందిన తలారి శ్రీకాంత్‌ను ఎనిమిదేళ్ల క్రితం బాధితురాలి తల్లి రెండో వివాహం చేసుకుంది. అయితే పెండ్లికి ముందే ఆమెకు కూతురు ఉండగా అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతులిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా పెంపుడు తండ్రి శ్రీకాంత్.. బాలికను లైంగికంగా వేధించేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో బాలిక ఆరోగ్య సమస్యల కారణంగా పాఠశాలకు వెళ్లలేదు. దాంతో నిందితుడు తన భార్యను పనికి పంపి, ఇద్దరు బాలురను స్కూల్‌కు పంపి బాలికపై లైంగికదాడి చేశాడు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పవద్దని, చెబితే చంపేస్తానని బెదిరించాడు. దాంతో బాలిక ఎవరికీ చెప్పలేదు. అప్పటినుంచి బాలికపై లైంగికదాడికి పాల్పడుతూనే ఉండేవాడు. మే 21న బాలిక కడుపు నొప్పిగా ఉందని చెప్పడంతో ఆమె తల్లి, అత్త మేడ్చల్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలిక గర్భవతి అని నిర్ధారణయ్యింది. దాంతో అనుమానం వచ్చి వారు శ్రీకాంత్‌ను నిలదీయడంతో ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడు.

## ధాన్యం కొనుగోలులో బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం

- రబీసీజన్‌లో నేటికి

**60.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో**



ధాన్యం కొనుగోలు అంశంలో బిఆర్ఎస్ అసత్యప్రచారనికి పూనుకుని ప్రజల్లో గందరగోళం సృష్టిస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఈ రబీ సీజన్‌లో ఈ రోజు సాయంత్రం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 60.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఆయన గణాంకాలతో శుక్రవారం వెల్లడించారు. అదే బిఆర్ఎస్ పాలనలో అంటే 2022-23 రబీ సీజన్లో నాటి పాలకులు మే 22 నాటికి కొనుగోలు చేసింది కేవలం 36.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగు అయిన చివరి రబీ సీజన్ లో నాటి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంతో పోల్చి చూస్తే ఈ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత రబీ సీజన్లో అదే మే 22 నాటికి రాష్ట్ర ప్రభుత్వం 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేసిందన్నారు. ఈ గణాంకాలే బిఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారానికి నిదర్శనమన్నారు చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న రైతాంగ అనుకూల విధానాలతో అటు ఖరీఫ్ ఇటు రబీ లోనూ రికార్డు స్థాయిలో ధాన్యాం దిగుబడి అత్యధికంగా దిగుబడి అయిన ధాన్యం దిగుబడిని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలను పెద్ద సంఖ్యలో పెంచామని ఆయన తెలిపారు.



## సిఎం సభ నేపథ్యంలో నిమ్జ్ రైతుల ముందస్తు అరెస్ట్

- అరెస్టులతో ఆందోళనను ఆపలేరన్న రైతులు

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

జహీరాబాద్‌లో జరిగే సిఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు తరలి వెళ్లకుండా సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం మామిడ్గి గ్రామ నిమ్జ్ రైతులను పోలీసులు గ్రామంలోనే నిర్బంధించి అడ్డుకున్నారు. నిమ్జ్ భూ బాధితులను శుక్రవారం తెల్లవారు జామునే హద్నూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని ముందస్తు అరెస్టు చేశారు. దాంతో మామిడ్గి భూ బాధితులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. 'నిమ్జ్ వద్దు.. భూములే ముద్దు' 'జై కిసాన్.. జై జవాన్..' అంటూ నినాదాలు చేశారు. ఇక్కడ పంటలు పండే సారవంతమైన భూములు నిమ్జ్‌కు ఇవ్వమని, బాధిత రైతులందరం కలిసికట్టుగా పోరాడుతామని స్పష్టంచేశారు. అక్రమ నిర్బంధాలతో రైతుల ఉద్యమాలు ఆపలేరని మామిడ్గి భూ బాధితులు రాజిరెడ్డి, సంజీవరెడ్డి, నాగన్న తదితరులు తెలిపారు. జహీరాబాద్‌లో సీఎం పర్యటన అనంతరం మంత్రి దామోదర్ రాజనర్సింహను నిమ్జ్ భూ బాధితులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రైతులకు అన్యాయం చేయొద్దన్నారు. 2013 చట్ట ప్రకారం భూ సేకరణ చేయాలని, రైతులకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు.



గ్రామంలో రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

- ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని రాష్ట్ర పరిశీలకులు ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. ములుగు జిల్లాలోని జవహర్‌నగర్ మోడల్ స్కూల్, చల్వాయి మోడల్ స్కూల్, చల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రెండవ దశ ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని 2025-26 విద్యా సంవత్సరంలో బడిబాట ద్వారా విద్యార్థుల నమోదును పెంచాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు, సమాజానికి నమ్మకం పెంచడానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పించాలనే భరోసా కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి జి. పాణిని, కోర్స్ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి, సెంటర్ ఇన్‌చార్జిలు ఈ. సూర్యనారాయణ, అర్షం రాజు, గుల్లపెల్లి సాంబయ్య, అప్పని జయదేవ్, మండల విద్యాశాఖ అధికారులు గొంది దివాకర్, రేగ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నాణ్యమైన విద్య దూరం చేస్తారా?

- స్కైలాబ్ బాబు

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా 12 గురుకుల జూనియర్ కళాశాలలను మూసివేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులు లేరనే సాకుతో జూనియర్ కళాశాలలను మూసేయడమంటే పేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను దూరం చేయడమేనని విమర్శించారు. అడ్మిషన్ల ప్రక్రియ జాప్యం వల్లే గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరలేకపోతున్నారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో తక్షణ ప్రవేశాల విధానాన్ని అమలు చేయడంలేదని పేర్కొన్నారు. తక్షణమే జూనియర్ కళాశాల మూసివేత నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అప్పుల్లో ఉందని స్వయానా ముఖ్యమంత్రి ప్రకటించారనీ, ఈ క్రమంలో కోతల్లో భాగంగా పేదవిద్యార్థుల భవిష్యత్‌పై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఎడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.



## ఇనార్బిట్ మాల్‌లో తొలి ఆపిల్ ప్రీమియం పార్టనర్ స్టోర్

- ప్రారంభించిన ఆప్ట్రోనిక్స్

**హైదరాబాద్ :** దేశంలోనే అతిపెద్ద ఆపిల్ ప్రీమియం రీ సెల్లర్ అయిన ఆప్ట్రోనిక్స్ తెలంగాణ తొలి ఆపిల్ ప్రీమియం పార్టనర్ స్టోర్‌ను హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లో వేడుకగా ప్రారంభించినట్లు తెలిపింది. ఈ స్టోర్‌లో ఆపిల్ అధీకృత సెంటర్ కూడా ఉందని పేర్కొంది. నూతన ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతీ ఉత్పత్తిపై కనీసం 12 శాతం తగ్గింపును పొందవచ్చని ఆప్ట్రోనిక్స్ వ్యవస్థాపకుడు సుతీందర్ సింగ్ అన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- పలు జిల్లాల్లో జాతీయ రహదారులపై బైఠాయించిన రైతులు
- కాంటాలు వేసి 20 రోజులు గడుస్తున్నా తరలించని వైనం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఎలాంటి ఆంక్షలు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కాంటాలు వేసి 20 రోజులవుతున్నా కేంద్రాల్లో ధాన్యం ఉందంటూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో శుక్రవారం రైతులు ఆందోళనలు నిర్వహించారు. జాతీయ రహదారులపై తడిసిన ధాన్యంతో బైటాయించి రాస్తారోకోలు నిర్వహించారు. కుమురంభీం - ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేటలో రైతులు రోడ్డుపై బైటాయించారు. తేమ, తప్ప, తాలు అని తీవ్ర జాప్యం చేస్తూ ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు వెంటనే అక్కడికి చేరుకుని రైతులకు మద్దతు తెలిపి మాట్లాడారు. ముఖ్యమంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి తడిసిన ధాన్యాన్ని కొంటామని ఒకపక్క చెబుతూనే, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ డేవిడ్ రైతుల వద్దకు వచ్చి.. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు సివిల్ సప్లయ్ కమిషనర్ చౌహన్‌తో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని కోరారు. ఈ మేరకు కమిషనర్ తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.


రోడ్డుపై బైఠాయించిన రైతులతో చర్చిస్తున్న ప్రభుత్వాధికారులు

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్టీ మామిడిపల్లి జాతీయ రహదారిపై తడిసిన వరి ధాన్యంతో రైతులు రాస్తారోకో నిర్వహించారు. వరి ధాన్యానికి మొలకలు వచ్చాయని, మూడు నాలుగు రోజుల నుంచి వర్షం కురుస్తున్నా త్వరితగతిన కొనుగోలు చేపట్టడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 20 రోజులు గడిచినా ఇప్పటికీ కాంట కాలేదని వాపోయారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తొగటి భూమన్న మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారి రాజాగౌడ్ రాస్తారోకో చేస్తున్న రైతుల దగ్గరకు వచ్చి మాట్లాడారు. త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం శ్రీ రాంనగర్, సింగరావుపేట్ గ్రామాల్లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నా చేశారు. అయోధ్య గ్రామం వద్ద రాయికల్-జగిత్యాల ప్రధాన రహదారిపై బైటాయించారు. ఎస్ఐ సీహెచ్ సుధీర్ రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ జె.గణేష్ రైతులకు నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండల కేంద్రంలో వరి ధాన్యం కాటాలు వేసి 20 రోజులు గడుస్తున్నా వాటిని తరలించకుండా నిర్వహకులు వదిలేశారు. రెండు రోజుల కిందట వర్షం కురవడంతో ధాన్యం బస్తాలు పూర్తిగా తడిశాయి. అయినా అధికారులు మాత్రం ధాన్యాన్ని తరలించకుండా వదిలేశారు. దాంతో శుక్రవారం రైతులు కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు.

## బిఆర్ఎస్ పార్టీ వికృత చేష్టలు

- నోటీసులకు భయపడి తప్పుడు ప్రకటనలు : మంత్రి ఉత్తమ్



ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్టీ వికృత చేష్టలకు పాల్పడుతోందని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరుకావాలని కెసిఆర్‌కు నోటీసులు ఇస్తే భయపడి తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. శుక్రవారం సచివాలయం మీడియా సెంటర్‌లో మంత్రి విలేకరులతో మాట్లాడారు. తుమ్మిడిహట్టి వద్ద నీళ్ల లేవని తప్పుడు ప్రచారం చేశారని, కమీషన్ల కోసం తప్పుడు లెక్కలు చెప్పారని బిఆర్ఎస్‌పై మండిపడ్డారు. జ్యుడిషియల్ కమిషన్‌ను తప్పుపట్టడం కరెక్ట్ కాదని చెప్పారు. మేడిగడ్డపై గత ప్రభుత్వం హయంలోనే కేసు నమోదు చేశారు. అక్కడ బాంబులు ఉన్నాయా లేదా అని ఎందుకు తేల్చలేదని కెటిఆర్‌ను మంత్రి ప్రశ్నించారు. మేడిగడ్డలో బాంబులు ఉన్నాయని తప్పుడు కామెంట్స్ చేసినందుకు చట్టప్రకారం చర్యలు ఉంటాయనీ స్పష్టం చేశారు. ఎన్‌డిఎస్ఎపై విమర్శలు చేసినందుకు కూడా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైట్ ఎలిఫెంట్ అని కాగ్ రిపోర్ట్ ఇచ్చిందనీ గుర్తు చేశారు. రూ.38 వేల కోట్లతో పూర్తి అయ్యే తుమ్మిడి హెట్టి ను వదిలేసి లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారు. ఆ పైసలతో ఎస్ ఎల్ బి సి, సీతారాం సాగర్, దిండి ప్రాజెక్టులు పూర్తి అయ్యేవని మంత్రి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును తిరిగి పునరుద్ధరణ చేయాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు. కమిషన్ జ్యుడీషియల్ సంస్థ...ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. తప్పు చేయకపోతే కమిషన్ ముందు హాజరు కావాలనీ , బాంబుల పై అనుమానం ఉంటే కమిషన్ ముందు హాజరై కమిషన్‌కు ఆధారాలు ఇవ్వాలని బిఆర్ఎస్ నేతలకు మంత్రి ఉత్తమ్ సూచించారు.

## రాహుల్ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లండి

- యువజన కాంగ్రెస్ నాయకులకు మంత్రి శ్రీధర్ బాబు దిశా నిర్దేశం

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

దేశంలో బిజెపి సాగిస్తున్న నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు రాహుల్ గాంధీ ఆలోచనలు, కాంగ్రెస్ పార్టీ విధి విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని యువజన కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర బాల వికాస కేంద్రంలో నిర్వహిస్తున్న "వైట్ టీ షర్ట్" శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం యువజన కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ అత్యంత ప్రతిష్టాత్మంగా చేపట్టిన "వైట్ టీ షర్ట్" ఉద్యమం చాలా గొప్పదన్నారు. కరుణ, ఐక్యత, అహింస, సమానత్వం అందరికీ పురోగతి లాంటి అయిదు మార్గదర్శకాలకు "వైట్ టీ షర్ట్" చిహ్నంగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి యువజన యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అన్నారు. దేశ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా యువజన కాంగ్రెస్ అవతరించిందన్నారు. ఆ స్ఫూర్తితో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు, రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిసిసి ప్రెసిడెంట్ హరివర్ధన్ రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి శ్రవణ్ రావు, నాయకులు నితీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్న మంత్రి శ్రీధర బాబు


కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## రజక ఆత్మగౌరవ భవన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తాం

- రజక ఫెడరేషన్ ఎండి చంద్రశేఖర్ హామీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రజక ఆత్మగౌరవ భవన స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడతామని, చుట్టూ ప్రహరీని నిర్మిస్తామని రజక ఫెడరేషన్ ఎండి చంద్రశేఖర్ తెలిపారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మేడిపల్లిలో రజక ఆత్మగౌరవ భవనం స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఇటీవల తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు.. స్థలాన్ని పరిశీలించాలని బిసి సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఝాన్సీరాణితో కలిసి రాష్ట్ర రజక ఫెడరేషన్ ఎండీ కబ్జాకు గురవుతున్న రజక ఆత్మగౌరవ భవన స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవనం చుట్టూ వెంటనే ప్రహరీ నిర్మిస్తామని, ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థలాన్ని కాపాడే బాధ్యత బిసి సంక్షేమ శాఖ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ పరిశీలనలో వారి వెంట తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, రజక సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొన్నే సంపత్, జిల్లా కార్యదర్శి జ్యోతి, మేడిపల్లి మండల రజక సొసైటీ అధ్యక్షులు అంబే చక్రపాణి, జిల్లా నాయకులు సట్టు రవి, వీరనారి చిట్యాల ఐలమ్మ మునిమనమరాలు సంధ్య, నాయకులు స్వప్న, సట్టు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో టాస్క్ ఫోర్స్ తనిఖీలు

- నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

జిహెచ్ఎంసి పరిధిలో నిబంధనలు పాటించని హాస్టళ్ల పై ఫుడ్ సేఫ్టీ తో పాటుగా ఇతర శాఖలతో ఏర్పడిన టాస్క్ ఫోర్స్ బృందాలు శుక్రవారం తనిఖీ చేశాయి. అనేక ప్రయివేట్ హాస్టళ్లు ఆహార భద్రత, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, అగ్ని ప్రమాద నివారణ మొదలైన నిబంధనలను ఉల్లంఘిస్తూ హాస్టళ్లను నిర్వహిస్తున్నారనీ టాస్క్ పోర్స్ బందాలు గుర్తించాయి. హాస్టళ్ల యాజమాన్యం సెల్లార్లను, పార్కింగ్ ప్రాంతాలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడం, నియమ నిబంధనలను ఉల్లంఘించి పెద్ద హోర్డింగ్‌లను ప్రదర్శించడం, అపరిశుభ్రంగా తయారు చేస్తున్న నాణ్యత లేని ఆహారాన్ని సరఫరా చేయడం, చిన్న గదుల్లో విద్యార్థును పెట్టడం, సరైన మరుగుదొడ్లు వంటి వారి ప్రాథమిక అవసరాలను హాస్టల్స్ నిర్వాహకులు విస్మరించారు.. అంతేకాకుండా వీధుల్లో వ్యర్థాలను పారవేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయి.


తనిఖీలు చేస్తున్న టాస్క్ ఫోర్స్ అధికారులు

అమీర్‌పేట, ఖైరతాబాద్ , అశోక్ నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించడానికి జీహెచ్ఎంసీ అధికారులతో స్పెషల్ టాస్క్ ఫోర్స్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించాయి. సుమారు 58 హాస్టళ్లను తనిఖీ చేసి, 30 హాస్టళ్లకు నోటీసులు జారీచేసి, 5 హాస్టల్ కిచెన్‌లనుసీజ్ చేశారు. జిహెచ్ఎంసి 1955 యాక్ట్ నిబంధనల ప్రకారం రూ.2.45 లక్ష లు జరిమానా విధించారు.

## బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే..

- ఎమ్మెల్సీ కవిత లేఖతో రుజువైంది : సాయికుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'బిజెపి, బిఆర్ఎస్ వేర్వేరు కాదు...ఒక్కటే' అంటూ కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతున్నదని ఫిషర్మన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ గుర్తు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖతో అది ఈనాటికి రుజువైందని చెప్పారు. కవిత అడిగిన ప్రశ్నలకు బిఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్ సమాధానం చెప్పాల్సిందేనన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కెసిఆర్‌ను కలవడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి గెలిచిన సీట్లపై ఆమె అడిగిన ప్రశ్నలకు బిఆర్ఎస్ నేతల వద్ద సమాధానం ఉందా? అని ప్రశ్నించారు.

## పదేళ్ల బిఆర్ఎస్ బండారం బయట పడింది

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ప్రజాశక్తి-హైదరాబాద్

కల్వకుంట్ల కవిత తన తండ్రికి రాసిన లేఖతో పదేళ్ల బిఆర్ఎస్ బండారం బయట పడిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఎద్దేవా చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వరంగల్ సభలో కెసిఆర్ నియంతలా ఒక్కడే మాట్లాడారని కవిత ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బిసిల రిజర్వేషన్లు, కులగణనపై కెసిఆర్ మౌనంగా ఉన్నారన్న విషయం తేటతెల్లమైందన్నారు. ఆ రెండు పార్టీల ఒప్పందాన్ని బయట పెట్టినందుకు కవితకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## 'సిఎం ప్రజావాణి'ని సందర్శించిన ట్రైనీ ఐఎఎస్ అధికారులు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన " సీఎం ప్రజావాణి"ని శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్ర కేడర్ ఐఎఎస్ అధికారుల బృందం సందర్శించింది. సిఎం ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును వారు క్షుణ్ణంగా పరిశీలించారు. పలు అంశాలపై ప్రజలు అందజేసే వినతి పత్రాల దరఖాస్తులను హెల్ప్ డెస్క్ సిబ్బంది సహకారాన్ని ఇవ్వడం, డెస్క్ అధికారులు వాటిని స్వీకరించి ఆన్లైన్లో సంబంధిత శాఖలకు పంపించే విధానాన్ని, ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారితో జరుపుతున్న సమన్వయ తీరును శిక్షణ పొందుతున్న ఐఎఎస్ అధికారులు పరిశీలించారు. అత్యవసర వైద్య సేవలు అందించే విభాగాన్ని కూడా వారు పరిశీలించారు.

ఈ సందర్బంగా శిక్షణ పొందుతున్న ఐఎఎస్ అధికారులు సిఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లతో భేటీ అయ్యారు. సిఎం ప్రజావాణి గురించి వారు అడిగి తెలుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని చిన్నారెడ్డి వారికి తెలిపారు. సీఎం ప్రజావాణిలో సమస్యల పరిష్కారం ప్రస్తుతం 68 శాతం ఉందని, రానున్న రోజుల్లో 70 శాతానికి మించి అత్యుత్తమ ఫలితాలు ఉంటాయని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ప్రజల నుంచి పిటిషన్స్ తీసుకుని సమస్యలు విని సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి, పిటిషన్స్ పై ఎండార్స్ మెంట్ చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు చిన్నారెడ్డి వారికి వివరించారు. సిఎం ప్రజావాణి అమలు తీరు తమకు ఎంతో స్ఫూర్తిని కలిగించిందని, భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారంలో తమకు ఇక్కడి అనుభవాలు చాలా ఉపయోగపడతాయని ట్రైనీ ఐఎఎస్ అధికారులు ప్రణయ్ కుమార్, సాలోని చాబ్ర పేర్కొన్నారు.


ప్రజావాణిలో ట్రైనీ ఐఎఎస్ అధికారులు

## బాలుడిని హతమార్చింది కన్నతల్లే!

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా దుబ్బాకలో అపహరణకు గురైన బాలుని మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. భర్త ప్రవర్తనతో విసుగుచెంది.. అతన్నుంచి విడిపోవాలని బాలుడిని కన్నతల్లే చంపిందని పోలీసుల విచారణలో తేలింది. దుబ్బాకలోని సిఐ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను సిఐ పి శ్రీనివాస్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈనెల 21న దుబ్బాక మండలం అప్పనపల్లిలో గుర్తు తెలియని దుండగులు రెండు నెలల బాలుడిని అపహరించారని.. ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసి ఎస్ఐ వి.గంగరాజు తమ సిబ్బందితో కలిసి పలు కోణాల్లో దర్యాప్తును ప్రారంభించారు. గ్రామంలోని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. అనుమానంతో ఆ బాలుని తల్లి కవితను విచారించగా.. తానే బాలుడిని బావిలో పడేసినట్టు నేరం ఒప్పుకుందన్నారు. మూడేండ్ల క్రితం రామగాళ్ల శ్రీమాన్‌ను ప్రేమించి పెండ్లి చేసుకున్న కవిత.. ఆమె తల్లిదండ్రులకు, బంధువులకు దూరమైంది. భర్త శ్రీమాన్ పలు కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. అలాగే అతను తరుచూ కవితను మానసికంగా వేధించేవాడు. దాంతో అతని ప్రవర్తన పట్ల విసుగు చెందిన కవిత.. తన రెండు నెలల కుమారుడ్ని గ్రామ సమీపంలోని రాజిరెడ్డికి చెందిన వ్యవసాయ బావిలో పడేసింది. ఏమీ తెలియనట్టు గుర్తు తెలియని దుండగులు అపహరించారంటూ భర్తకు చెప్పి పోలీస్ కేసు పెట్టించింది. కాగా, పోలీసుల దర్యాప్తులో ఆమె నేరం అంగీకరించడంతో.. నిందితురాల్ని రిమాండ్‌కు తరలించినట్టు సిఐ తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన ఎస్ఐ గంగరాజు, సిబ్బందిని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, దుబ్బాక సీఐ శ్రీనివాస్ అభినందించారు.


విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న సిఐ శ్రీనివాస్

## కెసిఆర్ చుట్టూ ఉన్న దెయ్యాల వల్ల పార్టీకి నష్టం

- ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

'మా నాయకుడు కెసిఆర్.. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది' అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న ఆమెకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో జాగృతి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ.. "వరంగల్ సభ తర్వాత రెండు వారాల క్రితం నా తండ్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు లేఖ రాశా. నా అభిప్రాయాలు లేఖ ద్వారా స్పష్టం చేశా. అంతర్గతంగా రాసిన లేఖ ఎలా బయటికి వచ్చిందో అర్థం కావడం లేదు. దీని వెనుక ఎవరు ఉన్నారో తెలియదు. నా కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుక పూర్తి చేసుకొని అమెరికా నుంచి వచ్చే లోపు లేఖ బహిర్గతమైంది. నేను అంతర్గతంగా కెసిఆర్‌కు రాసిన ఉత్తరం బహిర్గతం కావడంపై పార్టీలో ఉన్న అందరం ఆలోచించుకోవాల్సిన విషయం. పార్టీలో నాయకులు అనుకుంటున్న విషయాలే నేను లేఖలో ప్రస్తావించాను. గతంలోనూ నా తండ్రికి అంతర్గతంగా లేఖలు రాశా. కెసిఆర్ కుమార్తెనైన నేను రాసిన లేఖ లీక్ అయింది. దీన్ని బట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నా పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన వారి పరిస్థితేంటి? నా లేఖ లీక్ వెనుక ఎవరో ఉండి ఉండొచ్చు. కెసిఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. వాటి వల్లే పార్టీకి నష్టం. మా నాయకుడు కెసిఆర్.. ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుంది. కోవర్టులను పక్కకు తప్పిస్తే పార్టీ బాగుపడుతుంది. పార్టీలో చిన్న చిన్న లోపాలను చర్చించుకోవాల్సిన అవసరముంది. నా తండ్రికి నేను రెగ్యులర్‌గా లేఖలు రాస్తా. ఇందులో వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదు. నా లేఖ చూసి కాంగ్రెస్, బిజెపి సంబర పడ్సాలిన పనిలేదు" అని కవిత అన్నారు. ఎల్కతుర్తి సభ తర్వాత పాజిటివ్, నెగిటివ్ ఫీడ్ బ్యాక్ పేరుతో భారాస అధినేత కెసిఆర్‌కు ఇటీవల కవిత రాసిన లేఖ బయటికొచ్చింది. ఈ లేఖ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం కావడంతో ఆమె స్పందించారు.

## కాంగ్రెస్‌కు ఎటిఎంలా తెలంగాణ

- సాక్షాలతో సహా రేవంత్ రెడ్డి అవినీతిపై ఇడి ఛార్జిషీట్ : కెటిఆర్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను కాంగ్రెస్‌కు ఎటిఎంగా సీఎం రేవంత్ రెడ్డి మార్చారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం రేవంత్ రెడ్డి అవినీతిపై సాక్షాలతో సహా చార్జిషీట్ నమోదు చేసిందని తెలిపారు. దీనిపై ఏం చర్యలు తీసుకుంటుందో ఎన్‌డిఎ సర్కారు చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బదులివ్వాలని డిమాండ్ చేశారు. ఇడి ఛార్జిషీట్‌తో రేవంత్ రెడ్డి అవినీతి బాగోతం బయటకు వచ్చిందని చెప్పారు. ప్రజలను వంచించిన పాపం పండిందనీ, అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్‌పై ధర్మమే గెలుస్తుందని చెప్పారు.

గతంలో రూ.50 లక్షల బ్యాగ్‌తో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయబోయిన సిఎం రేవంత్ రెడ్డి అదే అవినీతిని కొనసాగిస్తున్నారని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిసిసి అధ్యక్షునిగా ఉన్న సమయంలో యంగ్ ఇండియా సంస్థకు విరాళాల కోసం వ్యాపారవేత్తలకు పదవుల ప్రలోభాలు చూపారనీ, పార్టీ నేతలకు లంచాలిచ్చారని ఛార్జిషీట్ లో పేర్కొన్నారని తెలిపారు. గతంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారనీ, పిసిసి పదవి కోసం రేవంత్ రెడ్డి రూ.50 కోట్లు ఖర్చు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు ఛార్జిషీట్‌లో ఇడి దాఖలు చేసిందనీ, దీనిపై రాహుల్ గాంధీ స్పందించాలని కోరారు.

కాంగ్రెస్ 18 నెలల పాలనలో అమృత్ స్కాం, ఆర్ఆర్ ట్యాక్స్ స్కాం, సివిల్ సప్లై స్కాం ఇలా ప్రతి నెల ఒక కుంభకోణం బయటపడుతోందని కెటిఆర్ విమర్శించారు. అవినీతిపై తాము లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రతి రోజు కొత్త నాటకం, కొత్త కుట్రతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా స్కాంలపై తాము లెవనెత్తిన ఆరోపణలకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? అని అనుమానం వ్యక్తం చేశారు. అవినీతి వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేస్తుందా? లేక కాపలా కాస్తుందా? అని నిలదీశారు. కమిషన్ లేనిదే ఫైలు కదలదని మంత్రి కొండా సురేఖ, 30 శాతం ఇవ్వకుంటే ప్రభుత్వంలో పనులు జరగడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారని కెటిఆర్ ప్రస్తావించారు.

## జూబ్లీహిల్స్‌లో ఆక్రమణలను తొలగించిన హైడ్రా

- రెండెకరాల పార్కుకు దారి లేకుండా చేసిన కిరాయిదారుడు
- కోర్టు అనుమతులతో కూల్చివేత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 41లో.. రోడ్డుతో పాటు నాలానూ ఆక్రమించి నిర్మించిన కట్టడాలను హైడ్రా శుక్రవారం తొలగించింది. 30 అడుగుల రహదారిలో ఆక్రమణలు తొలగించి రెండెకరాల పార్కుకు దారి చూపింది. దాదాపు రూ. 200 కోట్ల ఆస్తిని కాపాడి.. ప్రజా వినియోగంలోకి హైడ్రా తెచ్చింది. జూబ్లీహిల్స్ సొసైటీ ప్రతినిధులు, అక్కడ నివాస ప్రాంతాలకు చెందిన వారు ఇచ్చిన ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ క్షేత్ర స్థాయిలో ఇది వరకే పరిశీలించారు. నాలాతో పాటు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్టు నిర్ధారణ కావడంతో వాటి తొలగింపునకు హైడ్రా గతంలోనే నోటీసులు ఇచ్చింది. కోర్టునుంచి అనుమతులు లభించడంతో బుధవారం అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించింది.


కిరాయికి వచ్చి కబ్జాలు చేసిన వైనం..

జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 41లో అవసరాల శ్రీనివాస్ రుక్మాందగ రావుకు వెయ్యి గజాల స్థలం ఉంది. ఇందులో 200 గజాల వరకూ ఇల్లు కట్టారు. ఈ ఇల్లు జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడికి చేరువలో ఉంది. క్రోతుపల్లి శ్రీనివాస్‌కు దీన్ని అద్దెకు ఇచ్చారు. ఈ ఇంటికి పక్కనే 30 అడుగుల మేర రోడ్డు ఉంది. ఈ రోడ్డు మార్గంలో వెళ్తే రెండెకరాల పార్కుకు చేరుకోగలం. అయితే కిరాయిదారు ఆ దారినే మూసేసి పార్కుకు దారి లేకుండా చేశాడు. 30 అడుగుల మేర ఉన్న రహదారిలోనే బాక్స్ టైపు నాలా ఉండగా నాలాతో పాటు రోడ్డును సగం వరకూ ఆక్రమించేశాడు. ఇంటి ఖాళీ స్థలంతో పాటు పక్కనే ఉన్న రోడ్డును కూడా ఆక్రమించి హాస్టల్ నిర్మించాడు. ఇంటి వెనకున్న ఖాళీ స్థలంలో కారు మరమ్మతుల షెడ్డును ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చాడు. మొత్తం 907 గజాల మేర ఆక్రమణలకు పాల్పడ్డాడు. వాటిని అద్దెకు ఇచ్చి నెలకు రూ. 10 లక్షల వరకూ వసూలు చేస్తున్నాడు. ఇవన్నీ ఇంటి ఓనర్‌కు సంబంధం లేకుండా జరిగిపోయాయి.

### కిరాయిదారున్ని తప్పు పట్టిన కోర్టు..

బాధితుల నుంచి ఫిర్యాదు అందడంతో హైడ్రా రంగంలోకి దిగింది. ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చింది. ఆ నోటీసులపై కిరాయిదారుడు హైకోర్టును ఆశ్రయించారు. రోడ్డు, నాలాను ఆక్రమించి ఎలా నిర్మాణాలు చేపడతారంటూ కిరాయిదారుడిని కోర్టు ప్రశ్నించింది. అతను చేస్తున్న వాదనలను తప్పు పట్టింది. ఈ విషయంలో ఏమైనా అభ్యంతరాలున్నాయా అని ఇంటి ఓనర్‌ను కోర్టు అడిగింది. తనకెలాంటి అభ్యంతరాలు లేవని చెప్పడంతో ఆక్రమణల తొలగింపునకు హైకోర్టు అనుమతులు మంజూరు చేసింది. దాంతో బుధవారం రంగంలోకి దిగిన హైడ్రా అక్కడ నిర్మించిన హాస్టల్ భవనాన్ని, కారు మెకానిక్ షెడ్డును తొలగించింది.

### పార్కుకు దారి చూపిన హైడ్రా..

జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 41లో ఎటు చూసినా వ్యాపార సముదాయాలున్నాయి. ట్రాఫిక్ రద్దీతో ఎక్కడా నిల్చోడానికి కూడా స్థలం లేని ప్రాంతం. అలాంటి చోట 2 ఎకరాల మేర పార్కు ఉంటే ఎంత ప్రయోజనమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అయితే రోడ్డును ఆక్రమించి కిరాయిదారుడు నిర్మించిన కట్టడాలను హైడ్రా తొలగించడం తో ఇప్పుడు పార్కుకు దారి దొరికింది. ఇప్పుడా 2 ఎకరాల పార్కును జిహెచ్ఎంసి అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఆ పార్కు అందు బాటులోకి వస్తే అక్కడ ఎంతో మందికి ప్రాణవాయువు అందుతుంది. పార్కుకు దారి లభించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.